# కుర్రాళ్లోయ్-కుర్రాళ్ళు

టి.వి.ఎల్.కె.



అర్ధరాత్రి కావటానికి ఇంకో అరక్షణం మాత్రమే వుంది. అందునా అమావాస్య. —కటిక చీకటి— కన్ను పొడుచుకున్నా ఏమీ కన్పించటం లేదు. డిటెక్టివ్ "మ్యావ్" ఊరి వెలుపల వున్న శ్మశానంలో అతి నెమ్మదిగా శబ్దం రాకుండా అడుగులు వేస్తున్నాడు. ఎందుకలా వేస్తున్నాడయ్యా అంటే......ఓ గుర్తు తెలియని ముగ్గురు మనుషులు ఓ ఆడపిల్లను బలవంతంగా (ఆ పిల్ల ఇష్టపడే వెళుతోందేమో "మ్యావ్" గారికి తెలియదు) కారులో ఎక్కించుకొని పోవటం చూశాడు. పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు. (వేసేవాడో ఇంటర్నేషనల్ ఫూల్—మీదే వెయ్యక పక్కనెందుకేస్తాడో) అమ్మాయిని బలవంతంగా కారులో ఎక్కించుకొని పోతున్నారూ అంటే కారణం "రేప్-రేప్"— సిక్త్‌సెన్స్ చెబుతోంది. తన బుర్రని అభినందించేవాడు పక్కన ఎవరూ లేక తన్ని తనే అభినందించుకున్నాడు—"కంగ్రాట్స్ మ్యావ్" అని.

అవునూ! ఇంతకీ తనకు సరిపోయిన పేరే పెట్టారు అధికారులు (?)- ఎలుకల్ని పట్టడంలో పిల్లి ఎలాంటి మెలుకువలు- పద్ధతులూ వగైరా వగైరా తీసుకోగలదో అలాగే దొంగలని - హంతకులని - దేశద్రోహులని పట్టడంలో సుబ్రావ్ అంతటి ఘటికుడని "మ్యావ్" అన్నారు. (ఆ అధికారులూ మన సుబ్రావ్ ఒక్కటే మరచిపోయారు - పిల్లిని పట్టగల్గేది - అదే కుక్కని. లేకపోతే ఆ పేరే పెట్టేవారు పాపం సుబ్రావ్!) అంతే— ఏమీ ఆలోచించకుండా అతని కోసమే ఆ అర్ధరాత్రి నడిరోడ్డు మీద స్కూటర్‌కే తాళాలు తగిలించి వెళ్ళిపోయిన వ్యక్తికి మనసులోనే "థ్యాంక్స్" చెబుతూ ఫాలో అయాడు కారుని. శ్మశానం దగ్గర కారు ఆగిపోయింది— వారికి అనుమానం రాకుండా కొస్త దూరంలో స్కూటర్ ఆపి అతి నెమ్మదిగా శబ్దం రాకుండా అడుగులు వేస్తున్నాడు. (వచ్చేశామండీ కథలోకి) అక్కడ అమ్మాయి ఎలాంటి అరుపులుగాని- శబ్దంగాని వినిపించటం లేదు.

"అమ్మాయి నోట్లో గుడ్డలు కుక్కారు" సిక్త్‌సెన్స్ "ఎస్.ఎస్" అనుకుంటూ ఇంకో ఆరడుగులు ముందుకు వేశాడు. (ముందే చెప్పుకున్నాం గదండీ కటిక చీకటి అని) కాళ్ళకు ఏదో అడ్డుపడి బోర్లా పడ్డాడు- సెకను తర్వాత అర్ధమైంది తను పడ్డది ఓ మనిషి మీద అని.

"ఎవడ్రా వాడు? నా టైం ఇరవై నిముషాలు అని చెప్పానా? లేదా?" ఘాండ్రించాడు క్రిందుండేవాడు. పరిస్థితి అర్ధమైంది 'మ్యావ్'కు. చటుక్కున పిలబడి "గురూ, గురూ నాకో పదినిమిషాలు ఛాన్సు ఇవ్వు" సుబ్రావ్‌గా అనబోయి 'మ్యావ్'గా తన కర్తవ్యం గుర్తొచ్చి వెంటనే కంఠస్థ డైలాగులు సంధించాడు.

"రేయ్ బేవకూఫ్— (అమ్మమ్మా ఖచ్చితంగా ఈ మాట అని తీరాలి—ఎంత గొప్ప తిట్లు తిటితే అంత గొప్ప డిటెక్టివ్ గదా) అమాయకమైన ఆడపిల్లను అక్రమంగా అపహరించి....''(తర్వాత ఏం మాట్లాడాలన్నా (ప్రాస కుదరదే) అంటుండగానే మిగతా ఇద్దరూ 'మ్యావ్'ను ఒడిసి పట్టుకున్నారు. వాళ్ళనుంచి విడిపించుకోవటానికి గింజుకుంటూ ఆలోచిస్తున్నాడు.

"గాలిలోకి డైవ్-డైవ్" సిక్త్‌సెన్స్— సినిమా నారదుడు గుర్తొచ్చి రెండుకాళ్ళు పైకెత్త బోయాడు; ఊహూ. ఒక్క అంగుళం కూడా పైకెగరలేక పోతున్నాడు. "నారదా! ప్లీజ్ హెల్ప్ మి యువర్ మంత్రమ్" అంటూ ప్రార్థిస్తూ - ఆలోచిస్తూ.... "ఆ కరాటే- జూడో-కుంగ్‌ఫూ" థ్యాంక్యూ సిక్త్‌సెన్స్.

"ఖియాస్" భయంకరంగా అరుస్తూ పిడికిలి బిగించి కొట్టాడు.

"అబ్బా-రే సుబ్రావ్."

"అయితే నా అసలు పేరుతోసహా తెలుసన్నమాట. మిమ్మల్ని బ్రతకనివ్వను కాచుకో" అంటూ రెండవసారి పిడికిలి బిగించి "యా" అన్నాడు. అంతే-చొక్కా కాలరు పుచ్చుకుని ఒక్కతన్ను తన్నాడు పక్కనున్న అప్పారావు. ఆ దెబ్బకు మైకం కాస్త దిగి కళ్ళు తెరచి చూశాడు సుబ్రావ్. "ఎకనమిక్స్" క్లాసు జరుగుతోంది. అరనిమిషంలో జరిగిందేమిటో అర్ధమైంది సుబ్రావ్‌కు. అర్ధంకాని లెక్చరర్ "ఏమైంది" అంటూ వీళ్ళవైపు వస్తున్నాడు. తన ఒడిలోనున్న డిటెక్టివ్ పుస్తకాన్ని అర్జంట్‌గా పాఠ్యపుస్తకాల మధ్యలో పెడుతూ 'ఇక నీవే దిక్కు అప్పారావ్' పోజు పెట్టాడు. నిజం చెబితే తర్వాత తనకు "ఫ్రీగా" చదవటానికి ఇవ్వడేమోనని "ఏం లేదండీ. సుబ్రావ్ మీద గండుచీమ పోతుంటేనూ విదిలించాను-అంతే". అప్పారావు మాటలకి విసుక్కుంటూ "ఏం కుర్రాళ్ళో ఏమో. మంచి మూడ్ పాడుచేస్తారు" కోపంగా టేబుల్ వైపు కదిలాడు లెక్చరర్.

యుగసృష్టి పాపులర్ సైన్స్ పుస్తకాలు
చక్కని గెటప్‌తో (బాలజ్యోతి సైజు) వెలువడినవి
జీవపరిణామం రూ.10/-
ప్రొఫెసర్ యలమంచి రాధాకృష్ణ
(100 బొమ్మలతో ఆఫ్‌సెట్ ముద్రణ)
విశ్వం రెంటాల నాగేశ్వరరావు రూ.12/-
(100 అద్భుతమైన ఫోటోలతో ఆఫ్‌సెట్ ముద్రణ
వింతప్రాణులు రూ.7/-
డాక్టర్ పరుచూరి రాజారామ్
సచిత్ర, జంతుజీవనంలోని వింతలు
జీవుల సహజీవనం రూ.7/-
డాక్టర్ మైనేని కేశవదుర్గా ప్రసాద్
సచిత్రంగా, జీవుల స్నేహజీవన విశేషాలు
ధరలో ఒక రూపాయి తగ్గించి అడ్వాన్సు పంపాలి.
యుగసృష్టి పబ్లికేషన్స్ గుంటూరు-2

Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada- 10
Editor : Puranam Subrahmanya Sarma.